రైతుకు రుణమాఫీ చరిత్రాత్మకం


రామిడి విజయ్‌రెడ్డి

కీసర: రైతులకు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని కాంగ్రెస్ పార్టీ కీసర మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కీసరలో మాట్లాడుతూ... గతంలో మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో రైతులకు రుణమాఫీ జరిగిందని అప్పుడు రైతులకు ఎంతో మేలు జరిగిందని గుర్తుచేశారు. తిరిగి ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలలోపే ఒకే సారి రూ. 2 లక్షల చొప్పున రుణమాఫీ అవుతుందన్నారు. ఎన్నికల ముందు వరంగల్‌లో నిర్వహించిన రైతు డిక్లరేషన్‌లో భాగంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ రైతులకు ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో పేదలందరికీ ఆరు గ్యారంటీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

అన్నదానం పుణ్యకార్యం



కీసర: చీర్యాల శ్రీ లక్ష్మీనృసింహ స్వామి హాలయం వద్ద ప్రతి శనివారం భక్తులకు అన్నదానం ఉంటుందని ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం మధ్యాహ్నం భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వామివారి దర్శనార్థం ఆలయానికి హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చే భక్తులకు స్వామివారి దర్శనానంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. అన్నదానం పుణ్యకార్యమని.. భక్తులు ఈ అన్నప్రసాద వితరణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధర్మకర్త శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి, మహాలక్ష్మి' ఫలాలు...

అర్హులందరికీ అందాలి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

ప్రజాపాలన కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

మేడ్చల్: ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు పని చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మండల పరిషత్ కార్యాయంలో శనివారం ప్రజా పాలన కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ఎంట్రీ చేయాలని అన్నారు. రెండు పథకాలను విజయవంతంగా నడిపించాలని అన్నారు. ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రజలు దరఖాస్తు చేసుకునే సమయంలో ఎలాంటి పొరపాట్లు ఉన్నా సరిచేసుకునేందుకు ప్రజాపాలన కేంద్రాలు ఉపయోగపడతాయని స్పష్టం చేశారు. అర్హత ఉండి పథకాలు లబ్ధిపొందకపోతే మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రజా పాలన కేంద్రాల్లో ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాపాలనలో అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. ప్రజాపాలన కేంద్రంలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. ఎన్నింటిని పరిష్కరించారు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బాలికల పాఠశాల సందర్శన...

అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపికైన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ గౌతమ్ సందర్శించారు. పథకం కింద పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి విద్యార్థులు వారి తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులతో మాట్లాడారు. మెరుగైన బోధన చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పిల్లలతో మాట్లాడుతూ... చదవులు ఎలా ఉన్నాయి.. ఉపాధ్యాయులు చెప్పేది అర్థమవుతుందా.. పుస్తకాలు, నోట్‌బుక్కులు అందాయా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలు ఇళ్ల వద్ద ఉన్న సమయాల్లో చదువుపై దృష్టి పెట్టాలని తల్లితండ్రులకు సూచించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, తహసీల్దార్ శైలజ, ఎంపీడీఓ వసంతలక్ష్మి, డీఈఓ విజయకుమారి, ఐటీఐ ప్రిన్సిపాల్ హనుమానాయక్, పూర్వపు ప్రిన్సిపాల్ శైలజ, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి నిర్మల, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్.. జెడ్పీ బాలికల పాఠశాలలో విద్యార్థినితో మాట్లాడుతూ...

మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐలో...

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐని కలెక్టర్ గౌతమ్ సందర్శించారు. ఐటీఐలోని కోపా, డ్రాఫ్ట్స్ మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, మోటార్ మెకానిక్, టర్నర్, వెల్డర్ ట్రేడ్ ల్లో ట్రైనింగ్, ఐటిఐలో చేపట్టిన పలు స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ తెలుసుకున్నారు. ప్రావీణ్య స్కిల్ డెవలప్ మెంట్ వారు నిర్వహించిన స్కిల్స్ కాంపిటేషన్లో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి సాధించిన ఐటీఐ విద్యార్థులను కలెక్టర్ ప్రశంసించారు. ఐటీఐలో నూతనంగా ప్రారంభిస్తున్న సేవింగ్ టెక్నాలజీ (టైలరింగ్), ఫుడ్ టెక్నాలజీ ట్రేడ్ పట్ల కలెక్టర్ ఆసక్తి వ్యక్తం చేశారు. ఐటీఐలోని ఫ్రూట్, వెజిటేబుల్ ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించారు.

కలెక్టర్ గౌతమ్ ఆకస్మిక తనిఖీలు



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ పథకాల అమలు తీరుపై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆకస్మిక తనిఖీలకు శ్రీకారం చుట్టారు. సీఎంతోసహా సీఎస్ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దరికి చేర్చేందుకు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించిన నేపథ్యంలో ఇటీవల జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మండలాలు, పంచాయతీలు, పురపాలికల్లో పర్యటించి తనదైన ముద్ర వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా పరిపాలనను గాడిలో పెట్టేందుకు పలు విధానపరమైన చర్యలను తీసుకున్నారు. అధికారులు, ఉద్యోగులు విధుల నిర్వహణలో పారదర్శకత పాటించటంతోపాటు హాజరు విధానాన్ని మెరుగు పరిచేందుకు ఆగస్టు నుంచి కలెక్టరేట్‌లో బయోమెట్రిక్‌ను అమల్లోకి తీసుకస్తున్నారు. అలాగే ప్రజల వద్దకు అధికారుల వెళ్లేలా...ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవటంలో భాగంగా 15 మండలాలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించటంతోపాటు వారంలో రెండు రోజులు మంగళవారం, శుక్రవారం వారు పర్యటించేలా ఆదేశాలు జారీచేశారు. స్పెషల్ ఆఫీసర్లు క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించటంతో పాటు అమలు, ఉద్యోగులు పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని కలెక్టర్ కోరటం వంటి అంశాలన్నీ పాలనను చక్కదిద్దేందుకేననే చర్చ జరుగుతోంది. ధరణిసహా ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించటంతోపాటునేరుగా పర్యవేక్షణ కూడా కలెక్టర్ గౌతమ్ చేపడుతున్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు పటిష్ట చర్యలు


మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ కొండల్‌రెడ్డి చెప్పారు. శనివారం చైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బోనాల పండగ నిర్వహణ, సీజనల్ వ్యాధులు సోకకుండా చర్యలు, నూతన విద్యుత్ దీపాల ఏర్పాటు, కుక్కల బెడద నివారణ వంటి అంశాలపై సమావేశంలో చర్చ జరిగిందన్నారు. రూ. 24 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘట్‌కేసర్-శామీర్‌పేట లింక్ రోడ్డును కుదించాలి

కీసర: ఘట్‌కేసర్–శామీర్‌పేట లింక్ రోడ్డును 200 అడుగుల నుంచి 100 అడుగులకు కుదించాలని కీసర మండలానికి చెందిన పలువురు నాయకులు కోరారు. ఈ మేరకు వినతిపత్రాలను హెచ్‌ఎండీఏ కమిషనర్, జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డిలకు సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యుడు సింగిరెడ్డివెంకట్‌రెడ్డి, తటాకం నారాయణ, మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్, జూపల్లి వెంకటేష్, పండుగ కవిత శశికాంత్, కందాడి ప్రమీల మాట్లాడుతూ... ఘట్‌కేసర్–శామీర్‌పేట 200 అడుగుల రహదారికి దగ్గర నుంచే ఓఆర్‌ఆర్ రహదారి నిర్మితమైందని, గతంలో ఓఆర్‌ఆర్ లేని సమయంలో ఈ రహదారిని 200 అడుగుల విస్తరించాలని మాస్టర్‌ప్లాన్‌లో పొందుపర్చడం జరిగిందన్నారు. ఓఆర్‌ఆర్ రహదారి ఏర్పాటైన తరువాత ఈ రహదారిలో వాహనాల రాకపోకలు తగ్గాయన్నారు. లింక్‌రోడ్డు 200 అడుగులగా ఉండటంతో ఈ రహదారిగుండా వ్యవసాయ భూములు ఉన్న చిన్న సన్న కారు రైతులు తమ పిల్లల చదువులు, వివాహాల కోసం విక్రయించుకుందామంటే ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ రహదారిలో కొండాపూర్, భోగారం, కీసర, తిమ్మాయిపల్లి, తదితర గ్రామాల్లో ప్రధాన రహదారి గుండా 100 అడుగులలోపే పేదలకు చెందిన ఇండ్లు ఉన్నాయన్నారు. ఈ రహదారిని 200 అడుగుల మేర విస్తరిస్తే పేద రైతులు, నిరు పేదలు తమ ఇండ్లు, పొలాలను పోగొట్టుకోవాల్సి ఉంటుందన్నారు. సన్న చిన్నకారుల రైతులు, పేదలను దృష్టిలో ఉంచుకొని లింక్ రోడ్డును 100 అడుగులు మాత్రమే విస్తరించాలని, ఈ మేరకు మాస్టర్ ప్లాన్ లోనూ మార్పులు చేపట్టాలన్నారు.

మేడ్చల్‌లో భారీ వర్షం


మేడ్చల్ రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో శనివారం భారీగా వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ముసురుతో పాటు అప్పుడప్పుడు వర్షం జోరుగా కురిసింది. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి శనివారం కురిసన వానే అతిపెద్ద వాన. ఉదయం నుంచి ప్రారంభమై ఎడతెరిపి లేకుండా కురిసన వర్షంతో ఎక్కడ చూసినా నీరే కనిపించాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి,. కాలనీలలో పల్లపు ప్రాంతాలలో, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండి కనిపించాయి. పొద్దంతా ముసురు వేయడంతో జనజీవనానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. చెరువులకు, కుంటలకు నీరు చేరాయి.

కార్పొరేటర్ పర్యటన

మల్లాపూర్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం లోతట్టు ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి భవానీనగర్, న్యూ భవానీనగర్‌కాలనీల్లో పర్యటించారు. వరదనీరు నిల్వ ఉండకుండా చూడాలని, మ్యాన్‌హోల్స్‌ను తెరిచేవారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసరమైతే తప్పా.. బయటికి రావొద్దని సూచించారు. కాప్రా సర్కిల్ ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఈ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి


గుండ్లపోచంపల్లిలో చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్: పేదలకు మెరుగైన వైద్యం అందించే విషయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ఎంతగానో ఉపకరిస్తోందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. సీఎంఆర్‌ఎఫ్‌ను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మెరుగైన వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన నిధులకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే మల్లారెడ్డి శనివారం తన కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. పట్టణంలోని 17వ వార్డుకు చెందిన బొల్లి భాగ్యమ్మకు మంజూరైన రూ. 27 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అర్చన సందీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోధుమకుంట వాసులకు...

కీసర: ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గోధుమకుంట గ్రామానికి చెందిన పి. రవీందర్‌కు రూ. 33 వేలు, ఎస్.పూజకు రూ. 27,500 చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేసారు. గోధుమకుంట గ్రామ మాజీ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి, చీర లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లి పరిధిలో...


మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు అందజేశారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డులకు చెందిన రాజుకు రూ. 60 వేలు, సౌజన్యకు రూ. 45 వేలు, తేజశ్రీ రూ. 21 వేలకు సంబంధించిన చెక్కులను గ్రామ మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు హేమంత్‌రెడ్డి, బాలరాజ్, జైపాల్‌రెడ్డి తదితరులు అందజేశారు.

నాగారం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం


సమావేశంలో పాల్గొన్న నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ పరిధిలోని 20 వార్డులో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ. 3.7 కోట్ల మేర నిధులు కేటాయించాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. ఈ నిధులతో వార్డు కౌన్సిలర్ల సూచన మేరకు ఆయా వార్డుల్లో డ్రైనేజీ పనులు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారుల సహాయ సహకారాలతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా తీర్చిదిద్దనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ జి.రాజేంద్రకుమార్, మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిషన్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ విజయభారతి

కుషాయిగూడ: మానవ హక్కుల కమిషన్‌తో సత్వర న్యాయం పొందవచ్చని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ విజయభారతి అన్నారు. శనివారం ఆమె కుషాయిగూడలోని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల కమిషన్ పనితీరు, ఉపయోగాలు, తదితర అంశాలపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. సామాన్య ప్రజలకు మానవ హక్కుల కమిషన్ పనితీరుపై న్యాయవాదులు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆమెను ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. అమరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మోహన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా రాధికాగుప్తా



సాక్షి, సిటీ బ్యూరో: మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీ)గా రాధికాగుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు ఈ బాధ్యతల్లో కొనసాగిన అభిషేక్ ఆగస్త్య ఇటీవల ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. దీంతో ప్రస్తుతం హన్మకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న రాధికాగుప్తా మేడ్చల్-మల్కాజిగిరికి బదిలీ అయ్యారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు.

మద్యం బాటిళ్ల ధ్వంసం

శామీర్‌పేట్: శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గడచిన ఏడాదిగా పట్టుబడిన మద్యం బాటిళ్లను శనివారం పోలీస్ స్టేషన్‌లో అధికారులు ధ్వంసం చేశారు. శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ సమాచారం మేరకు... ఎక్సైజ్ చట్టం ప్రకారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో 63 కేసులు నమోదు కాగా 690 లీటర్ల మద్యాన్ని సాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని మేడ్చల్ ఎక్సైజ్ అడిషనల్ సూపరింటెండెంట్ మాధవయ్య పర్యవేక్షణలో పోలీసులు ధ్వంసం చేశారు.

పేకాట స్థావరంపై ఎస్‌వోటీ దాడి

జవహర్‌నగర్: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న స్థావరంపై ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌వోటీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దమ్మాయిగూడ సాయిప్రియ కాలనీలోని ఓ నివాసంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌వోటీ పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 1,50,575, రెండు కార్లు, 11 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అయితే అందులో మాజీ వార్డు మెంబర్, ప్రస్తుత కౌన్సిలర్ భర్త పాండల యాదగిరితో పాటు మరో 10 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి చాక్లెట్ల విక్రేత అరెస్ట్


నిందితుడు బబ్లూ కుమార్

పోచారం: గంజాయితో పాటు గంజాయి చాకెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ జూపల్లి రవి సమాచారం మేరకు... పీర్జాదిగూడలో బీహార్‌కు చెందిన బబ్లూ కుమార్ (53) కిరాణా షాపు నిర్వహిస్తూనే గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు ఘట్‌కేసర్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు షాపును తనిఖీ చేశారు. దుకాణంలో 253 గ్రాముల గంజాయి, 390 గ్రాముల గంజాయి చాక్లెట్లు దొరికాయి. దీంతో దుకాణాన్ని సీజ్ చేసి గంజాయితో పాటు గంజాయి చాక్లెట్లు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితున్ని రిమాండ్‌కు తరలించారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి


మొక్కలను పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్ పావని

ఘట్‌కేసర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం ఘట్‌కేసర్‌లోని గాంధీనగర్‌లో మొక్కల పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ పాల్గొని పలు రకాల మొక్కలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగజ్యోతి, నాయకులు జంగయ్య యాదవ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపు పటిష్ట చర్యలు: కీసర ఎంపీడీఓ గ్యామ

కీసర: వనమహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలను నాటడంతోపాటు, వాటిని పరిరక్షించే చర్యలు చేపట్టామని కీసర ఎంపీడీఓ గ్యామ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో వనమహోత్సవంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ... గ్రామాల్లో నిర్దేశించిన లక్ష్యానికి మించి మొక్కలను నాటాలన్నారు. ఈ నెలాఖరులోపు అనుకున్న మేర మొక్కలను నాటాలన్నారు. ఇందు కోసం గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థలు, మాజీ ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలన్నారు. ఎంపీవో నంద కిషోర్, ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ గ్యామ

చెట్టును ఢీ కొట్టిన స్కూల్ బస్సు


ప్రమాదానికి గురైన స్కూల్ బస్సు


బస్సులోంచి విద్యార్థులను బయటకు తీస్తున్న స్థానికులు

పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలు

జవహర్‌నగర్: ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు చెట్టును ఢీ కొట్టిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని డంపింగ్‌యార్డు సమీపంలో స్వామి నారాయణ గురుకుల స్కూల్‌కు చెందిన బస్సు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి డ్రైవర్ చెట్టును ఢీ కొట్టింది. బస్సులో ఉన్న పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని సమీపంలోని ఆస్పత్రికి తరలించగా ప్రమాదం లేదని వైద్యులు పేర్కొన్నారు. ఈ సంఘటనపై పోలీసులను వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

'పరిశుభ్రమైన సమాజాన్ని నిర్మిద్దాం'

మేడిపల్లి: వ్యాధి రహిత సమాజ నిర్మాణం కోసం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో «సఫాయి అప్నావో, బిమారీ భగావో» కార్యక్రమాన్ని మేయర్ జక్క వెంకట్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. స్వచ్ఛభారత్ మిషన్ (ఎస్‌బీఎం) ఫేజ్ –2లో భాగంగా వర్షాకాలంలో మెరుగైన పారిశుధ్యం, పరిశుభ్రత, వ్యర్థాల సేకరణ కమ్యూనిటీ పబ్లిక్ టాయిలెట్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రభావిత ప్రాంతాలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాలాలతో పాటు చెరువుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని అధికారులకు సూచించారు. ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ మురళి, బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, రమణారెడ్డి, కైసర్, వెంకన్న, అనిల్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై జెడ్‌సీకి వినతి

కుషాయిగూడ: స్థానిక సమస్యలు, అభివృద్ధి పనులపై మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ శనివారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ సమస్యలు, అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాజీవ్‌పార్కు అభివృద్ధి, బండ బావి వద్ద మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. దీనికి జెడ్‌సీ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.